మిర్చి రైతు కంటతడి

- పారుదల లేని సాగర్ కాల్వలు
- నీటి విడుదలలో స్పష్టత లేని ప్రభుత్వం
- ఎండిపోతున్న వేల ఎకరాల మిర్చిపంట
- కుంటలు, చెరువల నీటితో పంటకు నీటి తడి
- మోటార్లు, ట్రాక్టర్ల ఇంజిన్లతో నీటి మళ్లింపు

తాడికొండ: మిర్చి రైతులు సాగునీరు అందక అవస్థలు పడుతున్నారు. వేలాది ఎకరాల్లో సాగులో ఉన్న మిర్చి పంట సకాలంలో నీరందక ఎండిపోయే దశకు చేరుకుంటోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందుతుందనుకుంటున్న సమయానికి నీటి విడుదల నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. మిర్చి పంటకు సాగునీరు అందాలంటే సాగర్ కాల్వల నుంచి నీటిని విడుదల చేయాలి. సకాలంలో నీటిని విడుదల చేయాల్సిన అధికారులు దీనిపై దృష్టి సారించలేదు. దీంతో కాల్వలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది మిర్చి పంటకు తగిన ధర లేకపోవడంతో పెట్టుబడులే రైతులకు అదనపు భారంగా మారాయి. అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించలేక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. సాయం కోసం ఎదరు చూసిన హలధారులకు మొండిచేయి ఎదురైంది. సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి సాగర్ కాల్వలకు సత్వరమే నీటిని విడుదల చేయాలని సాగుదారులు కోరుతున్నారు. లేకుంటే రోడ్డెక్కి సాగునీరు సాధించుకోక తప్పదని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


మోటార్ ద్వారా నీటిని తోడేందుకు రైతుల పాట్లు


రావెల- పొన్నెకల్లు మధ్య చెరువు నుంచి నీటి మళ్లింపు


ఎండిపోతున్న మిర్చి పంట


పైపు లైన్ ద్వారా మిర్చి పంటకు నీటి తరలింపు


పారుదలలేని సాగర్ కాల్వ

సాగర్ కాల్వలకు నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఎండుతున్న పంటకు కుంటలు, చెరువుల్లో నీటిని తోడి తడి అందిస్తున్నారు. ఇందుకు రాత్రింబవళ్లు నానా కష్టాలు పడుతున్నారు. గట్లపై పడిగాపులు కాస్తూ కిలోమీటర్ల మేర నీటిని పంపింగ్ చేసుకొంటున్నారు. తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో ఈ ఏడాది మిర్చి సాగు దాదాపు 20 వేల ఎకరాలకు పైగా జరుగుతోంది.

ధర తర్వాత ముందు నీరివ్వండి



మిర్చి పంటకు సరైన ధర లేదు. ఈ సంగతెలా ఉన్నా కనీసం సాగుకు సకాలంలో నీరందించాల్సిన ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికిప్పుడు పంటకు నీటి తడి పెట్టేందుకు ఎక్కడా చుక్క నీరు కనబడటం లేదు. శ్రమకోర్చి కుంటలు, చెరువుల్లో నీటని తోడుకొచ్చి పంటకు అందిస్తున్నాం. సత్వరమే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలి

– పరుచూరి నారాయణ, రైతు, పాములపాడు

వెంటనే నీరు విడుదల చేయాలి



సాగర్ కాల్వలకు నీటిని వెంటనే విడుదల చేయకపోతే మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. పైపులు అద్దెకు తెచ్చి కిలోమీటర్ల దూరం నుంచి నీరు పెట్టాలంటే భారంగా మారింది. అధికారులు నీరు విడుదల చేయకుండా తాత్సారం చేయడం దుర్మార్గం. ప్రభుత్వం, అధికారులు వెంటనే సాగర్ కాల్వలకు నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలి

– చింతల భాస్కరరావు, రైతు సంఘ నాయకుడు, తాడికొండ

96 శాతం పింఛన్ల పంపిణీ



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు పంపిణీ ప్రక్రియ ప్రారంభించి తొలిరోజు 96 శాతం పెన్షన్లు అందజేశారు. కమిషనర్ అలీమ్‌బాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల పాల్గొని పింఛను నగదు అందజేశారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలో 12,916 మంది పింఛనుదారులు ఉండగా..12,484 మందికి పంపిణీ పూర్తి చేశారు. రూ.5,52,89,500లు మంజూరు కాగా రూ.5,33,41,000 లబ్ధిదారులకు అందజేసిన మొదటిరోజు 96.67 శాతం పూర్తిచేసినట్లు అడిషనల్ కమిషనర్ శకుంతలాదేవి పేర్కొన్నారు.

ఫిరంగిపురంలో 91 శాతం..

ఫిరంగిపురం: మండలంలోని 15 సచివాలయాల పరిధిలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 91 శాతం పూర్తయ్యిందని ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు. మిగిలినవారు అందుబాటులో లేకపోవడంతో వారికి ఆదివారం సిబ్బంది అందజేస్తారని చెప్పారు. సచివాలయ సిబ్బంది ఉదయం 5 గంటలకు ఆయా గ్రామాలకు పింఛన్ల పంపిణీ వెళ్లారు. కానీ, సర్వర్లు ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. సుమారు 9గంటల వరకు సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో పింఛను దారులు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు.

క్లుప్తంగా

మంత్రి నారా లోకేష్‌కు ఆహ్వానం



మంగళగిరి (తాడేపల్లిరూరల్): ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఉండవల్లిలోని తన నివాసంలో శనివారం శ్రీ పద్మశాలీయ బహుత్తమ సేవా సంఘం నాయకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత మంగళగిరి పద్మశాలీయ కల్యాణ మండపంలో భద్రావతి సమేత భావనాఋషి స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానించి, ఆహ్వాన పత్రిక, క్యాలెండర్ అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మునగాల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి వూట్ల వెంకట సాంబశివరావు, కమిటీ ప్రతినిధులు ఉద్దంటి గాంధీ, వూట్ల శ్రీమన్నారాయణ, నరసింహారావు, చంటి ఉన్నారు.

కోర్టు ఉత్తర్వులిచ్చినా పరిష్కారమేదీ?

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని లేబర్ కోర్టు, హై కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా సమస్య పరిష్కారం కాకపోవడం దారుణమని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి, మద్దతు తెలిపారు. ప్రభుత్వాలు మారినా కార్మికుల సమస్యను పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం, మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అల్లం విజయశ్రీ, టి.శారద, వై.రమాదేవి, దర్శి మల్లేశ్వరి దీక్షలో పాల్గొన్నారు. కూరపాటి స్టీవెన్, బి.అంకయ్య, ఎస్కే బాష, ఇస్మాయిల్, సుబ్బారావు, వేముల లక్ష్మి సంఘీభావం తెలియజేశారు.

ప్రియదర్శినిలో సెమినార్



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడి ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం హ్యాక్ ద ఫ్యూచర్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. విశాఖకు చెందిన టిలిచో లాబ్స్ సీఈవో, ఫౌండర్ హేమ కిరణ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి సెమినార్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ఆలోచనా శక్తిని పెంచుకునేలా, ఔత్సాహిక మనస్తత్వం కలిగి ఉండాలని సూచించారు. సెక్రటరి చందు విజయలక్ష్మి, ప్రిన్సిపల్ డాక్టర్ రాఘవేంద్ర విష్ణు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుజాత, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సరోజని, రామకృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజంట్‌కు సత్కారం



తాడేపల్లిరూరల్: ఎల్ఐసీ ఏజంట్‌గా 25 ఏళ్లు పనిచేసిన తాడేపల్లికి చెందిన దానబోయిన సుందరరావు యాదవ్‌ను శనివారం గుంటూరు బ్రాంచ్ ఎల్ఐసీ ఏజంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రభాకరరావు మాట్లాడుతూ బ్రాంచ్‌లో 25 ఏళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న ఏజెంట్లను సన్మానిస్తున్నామని తెలిపారు. సుందరరావు, పూర్ణకుమారి దంపతులను సత్కరించి, సిల్వర్ జూబ్లీ మెమెంటో అందజేశామని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి కె.రాజారావు, కోశాధికారి వై.శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు బీవీ రాఘవయ్య, ఏజంట్ మిత్రులు ఎ.శ్రీనివాసరావు, డీవీ నరసయ్య పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దక్షిణాముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. వేద పండితులు, గీతా భజన మండలి సభ్యులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం కావించారు. అనంతరం అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ, పి.నరసింహమూర్తి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి నాగవల్లీదళాలతో అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. అద్దేపల్లి సీతా రామాంజనేయులు, రవికుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం వీలుకాదని ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి మార్చి 8వ తేదీ నిర్వహించడం లేదని పేర్కొన్నారు.

వాసవీ అమ్మవారి ఆత్మార్పణ విశిష్టమైనది

అనుగ్రహ భాషణలో శ్రీప్రజ్ఞానంద సరస్వతీ (బాలస్వామీజీ)

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో జరిగిన అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో శుక్రవారం రాత్రి ప్రజ్ఞానంద సర్వసతి (బాలస్వామీజీ) వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన భారీ బహిరంగసభలో భక్తుల నుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. వాసవీ అమ్మవారి ఆత్మార్పణ విశిష్టతను భక్తులకు తెలియజేశారు. అమ్మవారి భక్తి కీర్తనలు, పిల్లలచే భరతనాట్యం చేయించారు. అమ్మవారిని రథంపై ఆసీనురాలును చేసి పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, నంబూరి వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, నాళం రజనీకుమార్, దేవస్థానం కమిటీ సభ్యులు, సాలిగ్రామ మఠం సభ్యులు, శ్రీవిద్యాపీఠం సభ్యులు బాలస్వామీజీతోపాటు పురవీధుల్లో ఊరేగింపులో పాల్గొన్నారు.


అనుగ్రహ భాషణ చేస్తున్న బాలస్వామీజీ

ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. సేకరించిన వివరాల ప్రకారం.. పట్టణ ఆర్ఆర్ నగర్‌కు చెందిన గంగా భవాని (42) మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స తీసుకుంటోంది. గత నెల 30వ తేదీన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా గమనించిన కుటుంబసభ్యులుఉ ప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాగి రంగు మచ్చలను గుర్తించాలి

ఫిరంగిపురం: శరీరంపై రాగి రంగు మచ్చలను ఆరోగ్య సిబ్బంది గుర్తించాలని డాక్టర్ శ్వేత సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్)ని ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఇంటింటికీ వ్యక్తులను పరిశీలించినట్లు ఆమె తెలిపారు. శరీరంపై రాగి రంగు మచ్చలు, స్పర్శలేని మచ్చలు పరిశీలించారన్నారు. మచ్చలు ఉన్నవారికి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నట్లుగా గుర్తించి, వారి వివరాలు అనుమానిత కేసుల జాబితాలో చేర్చి, యాప్‌లో అప్‌లోడు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల వయో పరిమితి పెంచాలి

తాడికొండ: రాజధానిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు విశ్రాంత వయో పరిమితి పెంచాలని సీఐటీయూ రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం.భాగ్యరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో శనివారం తుళ్లూరులోని ప్రాంతీయ సీఆర్డీయే కార్యాలయానికి తొలిసారి విచ్చేసిన కమిషనర్ కె.కన్నబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం భాగ్యరాజు మాట్లాడుతూ తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులుగా ఉన్న దళితులు, ఇతర పేదలు రాజధాని నిర్మాణం నేపథ్యంలో వ్యవసాయ పనులు లేక పారిశుద్ధ్య కార్మికులుగా మారారన్నారు. వీరికి జీతాలు సక్రమంగా అందక పోయినా, పీఎఫ్, ఈఎస్ఐ లేకపోయినా కరోనా సమయంలో సైతం ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు. వీరి సేవలను గుర్తించకుండా 58 ఏళ్లు దాటిన పారిశుద్ధ్య కార్మికులు పనిలోకి రావొద్దని శనివారం కొంతమంది అధికారులు చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజధాని ప్రాంతంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పారిశుద్ధ్య కార్మికులకు వయో పరిమితి 60 ఏళ్లకు పెంచాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణ ఏజెన్సీలకు ఆదేశాలివ్వాలని ఆయన కమిషనర్‌ను కోరామని చెప్పారు.

ఉర్దూ పాఠశాల విలీనం చేయొద్దు

ఫిరంగిపురం: మండలంలోని గుండాలపాడు ఉర్దూ పాఠశాలను విలీనం చేయొద్దంటూ గ్రామస్తులు, పాఠశాల కమిటీ చైర్మన్ ఎస్‌డీ జాన్‌వలి ఎంఈవో కార్యాలయంలో అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ ఉర్దూ పాఠశాల ద్వారా తమ పిల్లలు మాతృ బాషలో చదువుకునేందుకు వసతిగా ఉందని, విలీన ప్రయత్నాన్ని అధికారులు విరమించుకోవాలని కోరారు. ఎప్పటిలాగానే గ్రామంలోనే పాఠశాల నిర్వహించేలా చూడాలని వారు కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి, సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం మంగళగిరిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్ల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. కార్మికులందరికి పని కల్పించాలని, కనీస వేతనాలను అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు నందం బ్రహ్మేశ్వరరావు, కార్యదర్శి గండికోట దుర్గారావు, మున్సిపల్ వర్కర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అన్నవరపు

విద్యతోనే దేశ భవిష్యత్తు నిర్మాణం

ఫిరంగిపురం: విద్యతోనే దేశ భవిష్యత్తను నిర్మించవచ్చని నాసా అనలాగ్ ఆస్ట్రోనాట్ జాహ్నవి డాంగేటి అన్నారు. అమీనాబాద్ గ్రామంలోని ఫీనిక్స్ గ్లోబల్ స్కూల్‌లో శనివారం సైన్స్ అండ్ ఆర్ట్ టెక్నాలజీ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాహ్నవి పాల్గొన్నారు. ఫీనెక్స్ గ్లోబల్ స్కిల్స్‌పై ఆమె ప్రత్యేక ప్రశంసలు వ్యక్తం చేశారు. స్కూల్ విద్యార్థులు రూపొందించిన పలు ఆవిష్కరణలు, ప్రాజెక్టులను చూసి ఆనందం వ్యక్తం చేశారు. కరస్పాండెంట్ మోజేస్ మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులకు గ్లోబల్ స్కిల్ బెస్ట్ ఎడ్యుకేషన్ అని చెప్పారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులు, సైన్స్ సంబంధిత నమూనాలు పరిశీలించారు.



రైతుల ఫిర్యాదులను సంతృప్తికరంగా పరిష్కరించాలి

రాజధాని ప్రాంతంలో పర్యటించిన సీఆర్డీఏ కమిషనర్ కె. కన్నబాబు

తాడికొండ: రైతుల ఫిర్యాదులను మొక్కుబడిగా కాకుండా సంతృప్తికరంగా పరిష్కరించాలని సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు ఆదేశించారు. శనివారం రాజధాని ప్రాంతంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. అన్ని యూనిట్ల పరిధిలోని డిప్యూటీ కలెక్టర్లతో సమావేశాలు నిర్వహించారు. ఉదయం పెనుమాక యూనిట్ కార్యాలయంలో రాజధానిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రైతుల సమస్యలు, భూసేకరణ అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. నిర్మాణ పనుల్లో అలసత్వం ఉండకూడదని, వీలైనంత వేగంగా, పారదర్శకంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ల్యాండ్ పూలింగ్‌లో ఇంకా భూములివ్వని రైతుల అనుమానాలను నివృత్తి చేసి, సానుకూలంగా స్పందించేలా చూడాలన్నారు. అనంతరం ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతా కట్టడమైన సీఆర్డీఏ ప్రాజెక్టు ఆఫీసు పనులను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులను ఆఫీస్ డిజైన్ పురోగతి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్‌ల బిల్డింగ్ నిర్మాణ పనులను పరిశీలించి, అనంతరం అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం, ఐకానిక్ టవర్ల నిర్మాణాలను సందర్శించారు. కమిషర్ వెంట ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ గోపాల కృష్ణారెడ్డి, హౌసింగ్ అండ్ బిల్డింగ్స్ చీఫ్ ఇంజినీర్ జివి పల్లంరాజు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగ చీఫ్ ఇంజినీర్ సీహెచ్ ధనుంజయ పాల్గొన్నారు. రాజధాని ప్రాంతంలోని కట్టడాల పరిశీలన అనంతరం కమిషనర్ కె.కన్నబాబు తుళ్లూరు యూనిట్ కార్యాలయంలో సామాజిక అభివృద్ధి విభాగాధికారులతో సమావేశమై రాజధాని రైతులకు అందాల్సిన కౌలు, భూమిలేని నిరుపేదలకు అందుతున్న పింఛన్లు గురించి అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో జరిగే కట్టడాల పనుల్లో పాల్గొనేందుకు ఇతర ప్రాంతాల నుంచి అనేక మంది వలస కార్మికులు వస్తారని, వారి నివాస, సంక్షేమానికి సంబంధించిన చర్యలు పటిష్టంగా ఉండేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు ఉండాలని అధికారులను ఆదేశించారు. గ్రూప్ డైరెక్టర్ కృష్ణ మోహన్, సీఈ శ్రీనివాస్ యాదవ్, ఇతర క్షేత్రస్థాయి అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.


రాజధానిలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

గంజాయి కేసు..పోలీస్ స్టేషన్ వద్ద రచ్చ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మకాలు, కొనుగోలు జరుగుతున్న సమయంలో తాడేపల్లి పోలీసులు శనివారం ఒక యువకుడ్ని, ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. అలాగే గతేడాది ఏప్రిల్ 22న గంజాయి అమ్మకాల సమయంలో జరిగిన గొడవలో ఆరుగురు ఉండగా అప్పట్లో పోలీసులు నలుగురిని అరెస్ట్ చేయగా, ఇద్దరిని అరెస్ట్ చేయలేదు. వారిద్దరిలో తాడేపల్లికి చెందిన వడ్లపూడి మణికంఠను శుక్రవారం సాయంత్రం బైపాస్‌రోడ్‌లో అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో గుంటూరు క్రైమ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, వివరాలు వెల్లడించారు. నిందితుడిని మీడియాకు చూపిస్తుండగా అక్కడే ఉన్న తాడేపల్లికి చెందిన మణికంఠ తల్లిదండ్రులు.. 9 నెలల క్రితం గొడవ జరిగిందని, గొడవ మధ్యలోకి వెళ్లిన తమ కొడుకుని ఈ కేసులో ఇరికించారని ఆరోపించారు. తమ కొడుకు గంజాయి తాగడు, అమ్మడని, తమ కొడుకు వద్ద గంజాయి ప్యాకెట్లు దొరికాయా? పోలీసులకు కేసులు కావాలంటే గంజాయి అమ్మేవారిని, కొనేవారిని పట్టుకోండి కానీ, అమాయకుడైన తమ కొడుకును అరెస్ట్ చేయడమేమిటంటూ మణికంఠ తల్లి నాగమణి, తండ్రి బుజ్జి పెద్దగా కేకలు వేశారు. ఈ కేకలు విని మీడియా ప్రతినిధులు బయటకు వచ్చి వివరాలు అడుగుతుండగా.. అడిషనల్ ఎస్పీ రవికుమార్ అక్కడి నుంచి పూర్తి వివరాలు వెల్లడించకుండా వెళ్లిపోయారు. పోలీస్‌స్టేషన్ ముందు గొడవ జరుగుతున్నా ఏం జరుగుతోందని తెలుసుకోకుండా ఎస్పీ వెళ్లిపోవడం విశేషం. పోలీసులు మాత్రం మణికంఠ తల్లిదండ్రుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సీఐ కల్యాణ్‌రాజు మాట్లాడుతూ గొడవ జరిగిన సమయంలో ద్విచక్ర వాహనంపై విజయవాడకు చెందిన నీలం అనే వ్యక్తి పారిపోతుండగా అతడ్ని అదుపులోకి తీసుకున్నామని, సుమారు 1.5 కేజీ వరకు గంజాయి లభించిందని తెలిపారు. అతడిని విచారించగా విజయవాడలో తన నివాసం వద్ద ఉండే కార్తీక్, మణికంఠ ఏజన్సీ ప్రాంతం నుంచి కేజీ రెండు వేల రూపాయలకు గంజాయి తీసుకువచ్చి తాడేపల్లి పట్టణ పరిధిలో ఉన్న వివేక్, మణికంఠకు చిన్నచిన్న ప్యాకెట్లు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిపాడని చెప్పారు. అప్పట్లో ఈ కేసుకు సంబంధించి విజయవాడకు చెందిన నీలం, కార్తీక్, మణికంఠ, తాడేపల్లికి చెందిన వివేక్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించి తాడేపల్లికి చెందిన మణికంఠను, మన్యం జిల్లాకు చెందిన ప్రసాద్‌ను అరెస్ట్ చేయలేదని, వీరిద్దరి అరెస్ట్ పెండింగ్‌లో ఉందన్నారు. గత నాలుగు రోజుల నుంచి పాత కేసులకు సంబంధించి ముద్దాయిల కోసం దర్యాప్తు చేస్తుండగా మణికంఠ తాడేపల్లి బైపాస్‌లో కనిపించడంతో అతడ్ని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరుస్తున్నామని సీఐ తెలిపారు.


పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులతో వాదిస్తున్న మణికంఠ తల్లిదండ్రులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మంగళగిరి (తాడేపల్లిరూరల్): ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి ఎలక్షన్ కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా మంగళగిరి మండల పరిధిలో అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర, ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల మాట్లాడుతూ మంగళగిరి అర్బన్ పరిధిలో 4,500 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో ప్రతి పోలింగ్ కేంద్రానికి వెయ్యిలోపు ఓటర్లు ఉండేట్లు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వెయ్యి ఓట్లు దాటడంతో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మంగళగిరి రూరల్ పరిధిలో 3.591 మంది ఓటర్లు ఉండగా వారి కోసం నగర పరిధిలోని సీకే హైస్కూల్‌లో 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందులో కూడా ఒక ఆగ్జలరి కేంద్రాన్ని అదనంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, అడిషనల్ కమిషనర్ శకుంతల

స్ఫూర్తి ఫౌండేషన్ సేవలు మరువలేనివి



మేడికొండూరు: స్ఫూర్తి ఫౌండేషన్ సేవలు మరువలేనివని ఎంఈఓ అబ్దుల్ అలీమ్ అన్నారు. సిరిపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులకు 180 మందికి స్ఫూర్తి ఫౌండేషన్ రూ.1.80 లక్షల విలువ పునర్వినియోగ శానిటరీ ప్యాడ్‌లు శనివారం అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ..అమెరికాలో స్థిరపడిన పాఠశాల పూర్వ విద్యార్థిని కడియాల శిరీష తను చదువుకున్న పాఠశాల మీద ప్రేమతో స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా తండ్రి శివప్రసాద్‌తో కలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. హెచ్ఎం నాగలక్ష్మి పూర్వ విద్యార్థిని శిరీషను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉయ్యూరు శ్రీవ్యాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తామని కడియాల శివప్రసాద్ తెలిపారు.